డయేరియా దడ

విజృంభిస్తున్న వ్యాధి
జిల్లావ్యాప్తంగా బాధితులు
వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులకు పరుగులు
వైద్యశాలలు కిటకిట

డయేరియా విజృంభిస్తోంది. పిల్లలు, పెద్దలు అందరిలోనూ దడ పుట్టిస్తోంది. పల్లె, పట్నం తేడాలేకుండా జనం వాంతులు, విరేచనాలతో విలవిల్లాడుతున్నారు. ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. బాధితులు పోటెత్తుతుండడంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో సైతం పదుల సంఖ్యలో చేరి చికిత్స పొందుతున్నారు. ఏరియా, జిల్లా ఆస్పత్రులకు వందల సంఖ్యలో వస్తున్నారు. బెడ్ల కొరత తలెత్తుతోంది. పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి వారం రోజుల్లోనే 300మందిదాకా చికిత్సకు వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ధర్మవరం ఏరియా ఆస్పత్రిలోనూ అదే పరిస్థితి నెలకొంది. కొత్తచెరువులోనూ బాధితులు భారీగానే ఉన్నారు. జిల్లావ్యాప్తంగా జనం మంచం పట్టారు. కొందరు ప్రథమ చికిత్సల అనంతరం తిరిగి వెళ్తున్నారు. మరికొంతమంది ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు. ఇంకొందరు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. అమరాపురం మండలంలో ఓ యువకుడు డయేరియా బారినపడి చికిత్స పొందుతూ గురువారం మరణించాడు.

- పెనుకొండ టౌన్/ధర్మవరం





పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

ధర్మవరంలో..

పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి డయేరియా బాధితులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. వాంతులు, విరేచనాలతో రోజ 10 మందిదాకా ఆస్పత్రికి వస్తున్నారని వైద్యవర్గాల ద్వారా తెలుస్తోంది. వీరికి సీజనల్ వ్యాధుల బాధితులు తోడవడంతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. రోజూ ఓపీకి 700 నుంచి 900 మందిదాకా వస్తున్నారు. జూన్ 25వతేదీ నుంచి డయేరియా కేసులు వస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి తెలిపారు. జూన్ నెలలో 14 మంది పిల్లలు, 39 మంది పెద్దలు, ఈనెలలో ఇప్పటి వరకు పెద్దలు 44 మంది, పిల్లలు 18 మంది డయేరియా బారినపడి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారన్నారు. ఇందులో కొందరు ఆస్పత్రిలో అడ్మిట్ కాగా.. మరికొందరు రోజూ ఉదయం, సాయంత్రం వచ్చి చికిత్స తీసుకుంటున్నారన్నారు. దీంతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది.

కాలుష్యమే కారణం

నీటి, ఆహార కాలుష్యం కారణంగా డయేరియా సోకుతుంది. వ్యాధి బారినపడిన వారు భయపడాల్సిన అవసరం లేదు. జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. వాంతులు, విరేచనాల బారిన పడితే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకోవాలి. వైద్యుల సలహా మేరకే మందులు వాడాలి. ఓఆర్‌ఎస్, కొబ్బరినీరు తాగడం ద్వారా ఉపశమనం పొందవచ్చు.

- మాధవి, సూపరింటెండెంట్, ధర్మవరం ఏరియా ఆస్పత్రి



ధర్మవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పెనుకొండ ఆస్పత్రికి క్యూ

పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి రోజూ డయేరియా బాధితులు క్యూ కడుతున్నారు. గత పదిరోజుల్లో 229 మంది డయేరియా బారినపడి చికిత్స పొందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఇందులో పెద్దలు 219 మంది, చిన్నారులు 10 మంది ఉన్నారన్నారు. పెనుకొండ, రొద్దం మండలాల నుంచి 11 మంది ప్రస్తుతం డయేరియా బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రొద్దం మండలానికి చెందిన శ్రీకన్య, వరలక్ష్మి, గంగమ్మ, ముత్యాలమ్మ, కంబాలపల్లి రాధమ్మ, పెనుకొండ మండలానికి చెందిన మోహన్, సుధాకర్‌రెడ్డి (శెట్టిపల్లి), వారాధమ్మ (కురుబవాండ్లపల్లి), బాబయ్య (కోనాపురం), ఏక్‌నాథ్ (పెనుకొండ), ఓబుళమ్మ (గోరంట్ల) చికిత్స పొందుతున్నారు.

కొత్తచెరువు సీహెచ్‌సీ తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తచెరువు: స్థానిక సీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి మంజులవాణి, ఆర్డీఓ భాగ్యరేఖ గురువారం సందర్శించారు. డయేరియా బారినపడిన వారు ఆరోగ్యం గురించి ఆరాతీశారు. 'విజృంభిస్తున్న డయేరియా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' గురువారం ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. దీనిపై జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు స్పందించారు. కొత్తచెరువు సీహెచ్‌సీని తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్యాధికారి, ఆర్డీఓని ఆదేశించారు. ఆ మేరకు వారిరువురు కొత్తచెరువు సీహెచ్‌సీని తనిఖీ చేశారు. డయేరియా బాధితులతో మాట్లాడుతూ.. చికిత్సలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని ఆరాతీశారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ... మండలవ్యాప్తంగా 61 డయేరియా కేసులు నమోదయ్యాయనీ, వారికి చికిత్స అందించామన్నారు. మండలకేంద్రంలోని కమ్మపాళ్యంలో అత్యధికంగా ఆరు కేసులు నమోదయ్యాయనీ, దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఆ మేరకు పంచాయతీ అధికారులను ఆదేశించామన్నారు. ఆ ప్రాంతంలో శానిటేషన్‌తోపాటు మంచి నీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలని డీపీఓ, డీఎల్‌పీఓకు తెలియజేశామన్నారు. డయేరియా బారిన పడినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఓఆర్‌ఎస్, కొబ్బరినీళ్లు తీసుకోవాలని సూచించారు.




కొత్తచెరువు ఆస్పత్రిలో బాధితురాలితో మాట్లాడుతున్న ఆర్డీఓ, జిల్లా వైద్యాధికారి



ధర్మవరంలో..

అతిసారతో యువకుడి మృతి



నాగభూషణ (ఫైల్)

మడకశిర(అమరాపురం), జూలై 4: అమరాపురం మండలం కెంకెర గ్రామానికి చెందిన నాగభూషణ(30) అతిసారతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండ్రోజుల క్రితం వాంతులు, విరేచనాలు అధికం కావడంతో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు అతడి భార్య త్రిష తెలిపింది. కెంకెర గ్రామంలోని ఎస్సీ కాలనీలో నలుగురు అతిసారం బారినపడినట్లు స్థానికులు చెబుతున్నారు. వారు కర్ణాటక ఆస్పత్రులకు వెళ్లినట్లు సమాచారం.

అంధకారంలో గ్రామాలు..

విద్యుత్ సరఫరాలో అంతరాయం
మూడురోజులుగా చీకట్లో ఊళ్లు
పంటలను కాపాడుకునేదెలా
రైతుల ఇబ్బందులు
పట్టించుకోని విద్యుత్ అధికారులు

ధర్మవరం రూరల్, జూలై 4: మండలంలోని చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి, గరుడంపల్లి మూడురోజులుగా అంధకారంలో చిక్కుకున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. చీకట్లో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు కూడా కరెంటు సరఫరా లేక నరకం అనుభవిస్తున్నారు. విద్యుత్ అధికారులకు సమస్య తెలిపితే మూడురోజులుగా బ్రేక్‌డౌన్ అవుతోందని చెబుతున్నారే తప్ప.. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి సమస్యను పరిష్కరించట్లేదని ప్రజలు మండిపడుతున్నారు. మూడురోజులుగా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 వరకే విద్యుత్ సరఫరా ఉంటోందని వారు వాపోతున్నారు. దీంతో పొలాల్లో మోటార్లు ఆడక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సదరం సర్టిఫికెట్ల కోసం చిగిచెర్ల సచివాలయానికి వెళ్లిన దివ్యాంగులు విద్యుత్ సరఫరా లేక నిరాశగా వెనుదిరిగారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.






విద్యుత్ సరఫరా లేక చిగిచెర్లలో అలుముకున్న చీకట్లు

స్కూటీపై అమరావతికి మహిళ యాత్ర

గోరంట్ల, జూలై 4: హిందూపురానికి చెందిన మగ్బూల్‌జాన్ స్కూటీపై అమరావతికి యాత్ర చేపట్టారు. గురువారం ఉదయం ఆమె గోరంట్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంబేడ్కర్ విదేశీ విద్యాపథకాన్ని పునరుద్ధరించడంతో ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలిపేందుకు యాత్ర ప్రారంభించానన్నారు. గత వైసీపీ పాలనలో స్కాలర్‌షిప్ నిధులు అందక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. విదేశీ విద్యకు దూరం కావడంతో తాను విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెప్పాలని 2020లో విజయవాడకు స్కూటీపై వెళ్లానన్నారు. సెక్యూరిటీ గేటు బయటి నుంచే పంపించారని ఆమె ఆవేదన చెందారు. విషయాన్ని అప్పట్లో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు, నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారనీ, ఆ మేరకే కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. మాట నిలుపుకున్నారన్నారు. దీంతో వారికి ధన్యావాదాలు తెలపడానికి స్కూటీపై వెళ్తున్నట్లు చెప్పారు. ఆమెను గోరంట్లలోని సినిమా థియేటర్ వద్ద స్థానిక నాయకులు అజంతుల్లా, షారూక్, షర్పుద్దీన్, సాధిక్, ఫిరోజ్‌బాషా, షామీర్‌బాషా, ఆదినారాయణ, సుబ్బరాయుడు, మహబూబ్‌ఖాన్ సన్మానించారు.



స్కూటీపై యాత్ర చేస్తున్న మగ్బూల్‌జాన్

ఫోర్జరీ సంతకాలు.. నకిలీ సర్టిఫికెట్లు..

పురంలో దందా

వందల్లో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు
ఇంటి స్థలాలే ఎక్కువ
వైసీపీ నాయకుల కనుసన్నల్లో వ్యవహారం
పంచుకున్న అధికారులు, నాయకులు
ప్రభుత్వం మారడంతో వెలుగులోకి..
పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు


హిందూపురం: స్థలం ఉంది. అదీ విలువైనది. కొనాలంటే కష్టం. ఖర్చవుతుంది. కాజేస్తే పోలా.. అనుకున్నారు గత వైసీపీ పాలకులు. కొందరు అవినీతి అధికారులతో చేతులు కలిపి దందాకు తెరలేపారు. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ సర్టిఫికెట్లు సృష్టించారు. వాటితో స్థలాలను ఎంచక్కా అమ్మేసుకున్నారు. పట్టా భూములనూ ఇలాగే కాజేశారు. పురంలో ఈ దంతా పెద్దఎత్తున సాగింది. ప్రభుత్వం మారడంతో అక్రమ తంతు వెలుగులోకి వస్తోంది. పట్టణంలో భూముల విలువ ఆకాశాన్నంటుతోంది. సెంటు స్థలం కొనాలన్నా గగనమే. సామాన్యులు ఇంటి నివేశ స్థలం దక్కించుకోవాలంటే చాలా కష్టం. ఇలాంటివారిని ఆసరాగా తీసుకుని గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు నకిలీ దందా సాగించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సంతకాలే ఫోర్జరీ చేశారు. ఈ విషయంపై ఆ తహసీల్దారే స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ఫోర్జరీ సంతకాల వ్యవహారాన్ని రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే కొంతమంది కల్పవృక్షంగా మార్చుకున్నారు. హిందూపురం మండలం, పట్టణంలోనే ఫోర్జరీ సంతకాలతో 1500కిపైగా ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు బయటికి వచ్చినట్లు కొంతమంది రెవెన్యూ అధికారులే పేర్కొంటుండడం గమనార్హం. ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు అమ్మేసుకున్నారు. ఇందులో కొంత సొమ్మును వైసీపీ నాయకులకు ఇచ్చి మిగిలినది కార్యాలయంలోని సిబ్బంది, ఒకరిద్దరు అధికారులు పంచుకునేవారు. కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరు అధికారులు పట్టా భూములకు సైతం ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు సృష్టించి, ఫోర్జరీ సంతకాలతో క్రయవిక్రయాలు సాగించారంటే హిందూపురంలో నకిలీ దందా ఏ స్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.



తన సంతకాన్నే ఫోర్జరీ చేసి సృష్టించిన ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్‌ను చూపుతున్న అప్పటి తహసీల్దార్ శ్రీనివాసులు (ఫైల్)

ఇంటి స్థల పత్రాలే ఎక్కువ

హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే కొంతమంది.. ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలను సృష్టించి తహసీల్దార్ సంతకాలు, ఒకవేళ లేఅవుట్ స్కెచ్ కావాలంటే కొత్తగా సృష్టించి సర్వేయర్ సంతకాలు సైతం ఫోర్జరీ చేసినట్లు తెలుస్తోంది. హిందూపురం మండలంలో అతిపెద్ద పంచాయతీ గ్రామాల పరిధిలో ఈ నకిలీ సర్టిఫికెట్లు ఫోర్జరీ సంతకాలతో వందల్లో ఇంటి స్థలాలు క్రయవిక్రయాలు జరిగినట్లు సమాచారం. పారిశ్రామికవాడ ప్రాంతంలో కూడా అధికంగా ఈ తంతు సాగింది. ఈరెండుచోట్ల వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, కొంతమంది నాయకులు కలిసి ఈ దందాను సాగించారు. ఈ రెండు పంచాయతీల పరిధిలోనే సుమారు వెయ్యివరకు ఇంటి స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించినట్లు అంచనా. ఈ ప్రాంతంలో స్థలాల విలువ అధికంగా ఉండటంతో వీటినే ఎంచుకున్నారు. కొట్నూరు, కొల్లకుంట, మణేసముద్రం, కగ్గల్లు, పట్టణంలోని మోడల్‌కాలనీ, సీపీఐ, యర్ర కొట్టాల ప్రాంతంతోపాటు కొటిపి పంచాయతీ పరిధిలో నకిలీ దందా సాగింది. ఈ నకిలీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు గత వైసీపీ పాలనలో చేసిన నాయకులు, అధికారులు లక్షల్లో సంపాదించినట్లు సమాచారం.



ఇటీవల వెలుగులోకి వచ్చిన ఫోర్జరీ సంతకాల ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్

పంచేసుకున్నారు..

నకిలీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు సృష్టించి అందులో వచ్చిన సొమ్ము వైసీపీ నాయకులు, అధికారులు పంచుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన తృతీయశ్రేణి అధికారుల హస్తం కూడా ఉన్నట్లు సమాచారం. కొవిడ్ తరువాత ఈ నకిలీ దందా జోరుగా సాగింది. పక్క మండలానికి చెందిన అధికారి ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో రోజూ ఇదే తంతు సాగినట్లు అప్పట్లో రెవెన్యూ అధికారులే చర్చించుకున్నారు. ఈ వ్యవహారమంతా కొంతమంది వైసీపీ నాయకుల కనుసన్నల్లో సాగినట్లు సమాచారం.

కూటమి అధికారం చేపట్టడంతో..

వైసీపీ ఓడిపోయి, కూటమి అధికారం చేపట్టడంతో నకిలీదందా వెలుగులోకి వచ్చింది. వైసీపీ పాలనలోనే అనుమానం వచ్చినా వారు బయటకు చెప్పడానికి భయపడ్డారు. కూటమి అధికారంలోకి రావడంతో కొంతమంది బాధితులు ధైర్యంగా ముందుకొచ్చారు. మరికొంతమంది ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే ఫోర్జరీ సంతకాల వ్యవహారం, నకిలీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు సృష్టించి క్రయవిక్రయాలు చేసిన బాగోతం బయటకు వచ్చింది. బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకొచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని టీడీపీ నాయకులు భరోసా ఇచ్చారు. దీంతో మణేసముద్రం వద్ద పట్టాభూమికి నకిలీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ సృష్టించి, విక్రయాలు సాగించిన వ్యవహారంపై అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిరికెర పంచాయతీ పరిధిలో ఇలాంటి బాధితులే పోలీసులను ఆశ్రయించారు. ఏది ఏమైనా వైసీపీ పాలనలో హిందూపురాన్ని ఫోర్జరీ సంతకాలు, దొంగ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు, తప్పుడు పత్రాలు సృష్టించడానికి కేరాఫ్‌గా మార్చారని విమర్శలు వినిపిస్తున్నాయి.



తన పట్టాభూమికి ఫోర్జరీ సంతకాలతో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఇచ్చారని సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

అల్లూరి పోరాటం ఆదర్శం: జేసీ



అల్లూరి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, జూలై 4: భారత స్వాతంత్ర్యం కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సాగించిన పోరాటం ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ (జేసీ) అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ.. మన్యంలో గిరిజన ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమానికి సమాయత్తం చేసి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు అల్లూరి అని కొనియాడారు. తెల్లదొరల చేతిలో దోపిడీకి లోనవుతున్న ఏజెన్సీ ప్రజలకు అండగా పోరాటం చేసి, వారి కోసం అమరుడయ్యారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రామ్, డీఈఓ మీనాక్షి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సర్వే ఏడీ రామకృష్ణ, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగప్రసాద్, ఐసీడీఎస్ పీడీ నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి

పుట్టపర్తి రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఘననివాళులు అర్పించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సైబర్‌సెల్ సీఐ హేమంత్‌కుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్ పాల్గొన్నారు.



మన్యంవీరుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

మరమ్మతులకు శ్రీకారం

● మారనున్న రహదారుల రూపురేఖలు

- ప్రణాళిక సిద్ధం చేసిన అర్‌అండ్‌బీ అధికారులు..
- రూ.కోట్ల అంచనాలతో నివేదిక..
- గత ప్రభుత్వంలో మూడేళ్లే కేటాయింపు..
- అధ్వాన స్థితిలో రోడ్లు.. అవస్థల్లో ప్రజలు..
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అనంతపురం సిటీ, జూలై 4: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రహదారుల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పూర్తిగా దెబ్బతిన్న, గుంతలమయమైన రహదారులు (రాష్ట్ర రహదారులు, జిల్లా మేజర్ రోడ్లు) వెంటనే గుర్తించి తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను అదేశించింది. దీంతో ఆశాఖ అధికారులు ఎంతో వేగవంతంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరమ్మతులకు రూ. 13 కోట్లతో కూడిన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. సీఎం చంద్రబాబునాయుడు సైతం రెండు రోజుల కింద ఆశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి రహదారుల స్థితిగతులపై ఆరా తీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం ఇలాంటి వాటికి శ్రీకారం చుట్టడంతో దయనీయస్థితికి చేరిన ఆర్‌ అండ్‌రోడ్ల రూపు రేఖలు మారేనా..? అని ఆశాఖలో చర్చ సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రహదారులు ఆధ్వానస్థితికి చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగేది. నూతన ప్రభుత్వంలోనైనా.. ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మత్తులు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శ్రీ సత్యసాయి జిల్లా దామాజిపల్లి నుంచి తాడిపత్రికి వెళ్లే రహదారి ఇలా..



కొక్కంటి క్రాస్‌లోని రహదారి



విడపనకల్లు నుంచి గడేకల్ రోడ్డు ఇలా..

● ప్రణాళిక సిద్ధంచేసిన అధికారులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత ఐదేళ్లలో అర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపు లేకపోవడంతో ఎక్కడిక్కడ రోడ్లు దయనీయ స్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మత్తులకు శ్రీకారం చుట్టింది. ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేయాలని అదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశాఖ అధికారులు హుటాహుటిన రోడ్లను పరిశీలించారు. గత ప్రభుత్వంలో రహదారుల దుస్థితితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గోతుల రోడ్లతో పలుమార్లు వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలూ ఉన్నాయి. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.

ఉమ్మడి జిల్లా పరిధిలో అధికారులు పంపిన నివేదిక

- అనంతపురం జిల్లాలో మేజర్ రహదారుల మరమ్మతులు	: రూ. 9.24 కోట్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో మేజర్ రహదారులకు	: రూ.2.23 కోట్లు
- అనంతపురం జిల్లాలో స్టేట్ హైవేస్ రహదారులు	: రూ. 1.13 కోట్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో స్టేట్ హైవేస్ రహదారులకు	: రూ. 40 లక్షలు

రహదారుల మరమ్మతులకు పంపిన నివేదిక మొత్తం: రూ. 13 కోట్లు

ప్రభుత్వానికి నివేదిక పంపాం..

కొత్త ప్రభుత్వం దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లపై నివేదిక పంపాలని అదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలించి రూ. 13 కోట్లతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నిధులు కేటాయించగానే.. పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.



- ఓబుల్‌రెడ్డి, ఎస్ఈ, అర్‌అండ్‌బీ



కల్లూరు నుంచి గార్లదిన్నెకు వెళ్లే రహదారి

గత ప్రభుత్వంలో నిధులు అంతంతే...

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రోడ్లను పూర్తిగా విస్మరించింది. ఎక్కడిక్కడ సదరు రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. ఆ దారుల గుండా ప్రయాణం చేయాలంటే నరకం చవిచూడాల్సిన దుస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొంది. అధికార లెక్కల ప్రకారం.. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో మొదట రెండేళ్ల ఒక్కపైసా కూడా రోడ్ల మరమ్మత్తులకు నిధులు కేటాయించలేదు. తద్వారా రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా మారినట్లైంది. ఆ తర్వాత మూడేళ్లలో కేవలం అడపదడపా నిధులు కేటాయించి మమ అనిపించారనే విమర్శలు లేకపోలేదు. అదీకూడా ఎన్నికలు వస్తాయి... కదా..? అని నామమాత్రపు నిధులు కేటాయించారనే విమర్శలు లేకపోలేదు. అప్పట్లో అర్‌అండ్‌బీ రోడ్ల దుస్థితిపై జనసేనాని కూడా వైసీపీపై విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో వైసీపీ ఆర్‌అండ్‌బీ రోడ్లను పూర్తిగా ఆధ్వానస్థితి తీసుకెళ్లిందనడంలో ఏమాత్రం సందేహాలు లేకపోలేదు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

అనంతపురం విద్య, జూలై 4: నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బంద్ సందర్భంగా విద్యార్థి సంఘాలు నగరంలో ర్యాలీ నిర్వహించాయి. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, జేఎన్‌టీయూలో సైతం బంద్ చేయించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం కూడా నీట్‌పై కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, నరేష్, వీరేంద్ర ప్రసాద్, అబ్దుల్ అలం, వినోద్‌కుమార్, సాయికుమార్, రమణయ్య, ప్రతిభా భారతి, మంజునాథ్, ఉమా మహేష్, వంశీ, హరికృష్ణ, సోము, నాని, ఓబులేషు, బాలకృష్ణ, పవన్, రారాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ బీఎన్ కాలేజీలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

ముగ్గురికి జన్మనిచ్చి.. కన్నుమూసిన తల్లి

మోటువారుపల్లిలో విషాదం నింపిన ఘటన

పెనుకొండ రూరల్, జూలై 4: ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చి.. తల్లి కన్నుమూసింది. పెనుకొండ మండలం మోటువారుపల్లికి చెందిన కె.వెన్నెల(24) అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లికి చెందిన నాగలింగమయ్య, నాగసుబ్బమ్మ దంపతుల కూతురు వెన్నెలకు మూడేళ్ల క్రితం మోటువారిపల్లికి చెందిన గిరినాథ్‌తో వివాహం జరిగింది. గర్భంలో ముగ్గురు శిశువులు ఉండటంతో ఆమె బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో క్రమం తప్పకుండా వైద్యం చేయించుకునేది. అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రసవం కోసం వారం క్రితం అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అడ్మిట్ అయ్యింది. గతనెల 30న ఆమెకు పురిటి నొప్పులు అధికం కావడంతో వైద్యులు సిజేరియన్ చేశారు. ఇద్దరు మగశిశువులు, ఒక ఆడశిశువుకు ఆమె జన్మనిచ్చింది. ముగ్గురు శిశువులూ ఆరోగ్యంగా ఉన్నారు. వెన్నెలకు బీపీ తగ్గిపోవడంతో కోమాలోకి వెళ్లింది. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. వెన్నెల మృతితో మోటువారిపల్లి, కురుబవాండ్లపల్లి గ్రామాల్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మోటువారిపల్లికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వెన్నెల మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.





వెన్నెల మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి, వెన్నెల (ఫైల్)

యూపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఆర్ఓ రామకృష్ణారెడ్డి



అనంతపురం టౌన్, జూలై 4 : ఈనెల 7వ తేదీన జిల్లాలో జరగనున్న యూపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ రామకృష్ణారెడ్డి... అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పరీక్షల నిర్వహణకు ఎంపికైన అదికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఆదివారం యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఉదయం 9-30 గంటలనుంచి 11-30 గంటల వరకు ఈపీఎఫ్ఓ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటలనుంచి 4గంటల వరకు ఈఎస్ఐసీ పరీక్ష జరుగుతుందన్నారు. ఈపీఎఫ్ఓ పరీక్షకు ఉదయం 434 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం జరిగే ఈఎస్ఐసీ పరీక్షకు 2,109 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఈపీఎఫ్ఓ పరీక్షకు రెండు కేంద్రాలు, ఈఎస్ఐసీ పరీక్షకు ఆరు కేంద్రాలు జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేశారన్నారు. పరీక్షల నిర్వహణ కోసం సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, బస్సు వసతి కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు నిబంధనలు పాటించాలని, వేళకు ముందే పరీక్షకు హాజరు కావాలన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

● 'జలశక్తి అభియాన్'పై సమీక్షలో సెంట్రల్ నోడల్ అధికారి అరులానందన్

అనంతపురం టౌన్, జూలై 4: ప్రతి వర్షపు నీటి బొట్టును వృథా కాకుండా ఒడిసి పట్టి భూగర్భజలాలను పెంచాలని డైరెక్టర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్‌కామర్స్ సెంట్రల్ అధికారి అరులానందన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో 'జలశక్తి అభియాన్' అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అరులానందన్ మాట్లాడుతూ జలశక్తి కింద జిల్లాలో పనులు చేపట్టడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నీటి లభ్యత పెరిగేలా పనులు చేపట్టాలన్నారు. కురిసిన వర్షపు నీటిని వృథా పోకుండా చూసి ఒడిసి పట్టి నీటి జలాలు పెరిగేలా చూడాలన్నారు. ఇంకుడు గుంతల వల్ల కూడా నీరునిల్వ ఉండి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో మూడురోజుల పాటు జలశక్తి అబియాన్ కింద చేపట్టిన పనులను పరిశీలిస్తామని, ఇంకా నీటి లభ్యత పెరగడానికి ఎలాంటి పనులు చేపట్టాలో చూస్తామన్నారు. అనంతలో జల లభ్యత పెరగడానికి కృషి చేయాలన్నారు. అధికారులు సమష్టిగా పనిచేసి జిల్లా అబివృద్ధికి పాటు పడాలని కోరారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులను బలోపేతం చేయడమే లక్ష్యంగా మనమందరం పనిచేద్దామన్నారు. ఫారంపాండ్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఐఈసీ యాక్టివిటీలను చేపట్టాలని అదికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ షరీఫ్ ఎఖాన్, వివిదశాఖల ఉన్నతాదికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సెంట్రల్ నోడల్ అధికారి అరులానందన్, కలెక్టర్ వినోద్ కుమార్



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి పయ్యావుల

కేంద్ర మంత్రులను కలిసిన మంత్రి పయ్యావుల

ఉరవకొండ, జూలై 4: ఢిల్లీలో సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు, రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నులు శాసన సభ వ్యవహారాల శాఖామంత్రి పయ్యావుల కేశవ్ గురువారం కేంద్ర మంత్రులను కలిశారు. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, నితిన్ గడ్కరిని వారు కలిశారు.

ఆముదం పంటతో అధిక లాభాలు

ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం, జూలై 4: ఉమ్మడి జిల్లాలో మెట్ట సాగులో వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఆముదం పంట దిట్ట అని రేకలకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రేకలకుంటలోని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కార్యాలయంలో ఆముదం (సంకర రకం ఐసీహెచ్) విత్తనాలతో పాటు సైకిల్ వీడర్, వ్యవసాయ ఉపకరణాలు పలువురు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట అధికంగా సాగు చేస్తున్నారన్నారు. సకాలంలో వర్షాలు రాకపోతే.. తీవ్ర నష్టం తప్పదన్నారు. ఆముదం పంట అయితే మెట్ట పంటలో కొంచెం వర్షం తక్కువైనా పంట చేతికి వస్తుందన్నారు. రైతులు పంట మార్పిడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయంలో మెలకువలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆముదం సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త దుర్గాప్రసాద్, గుత్తా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు, ఉపకరణాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు



స్వాధీనం చేసుకున్న డబ్బుతో డీఆర్ఎం కార్యాలయంలోకి వెళ్తున్న సీబీఐ అధికారులు

రైల్వే అవినీతిపై సీబీఐ వల

- అదుపులో సీనియర్ డీఎఫ్ఎం సహా ఐదుగురు
- గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో రాత్రిదాకా విచారణ

గుంతకల్లు, జూలై 4: అనంతపురం జిల్లా గుంతకల్లు డివిజనల్ రైల్వే కార్యాలయంలో అవినీతి చేపలు సీబీఐ వలకు చిక్కాయి. కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్‌లో అవినీతికి పాల్పడిన అధికారులను గురువారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని కడప వద్ద రైల్వేవంతెన నిర్మాణ పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టరును రైల్వే అకౌంట్సు శాఖ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. ఈ పనులకు ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించగా, కడపకు చెందిన ఓ కాంట్రాక్టరు ప్రైజ్ బిడ్డర్ అయ్యారు. పనికి సంబంధించి అక్సెప్టెన్సీ లెటరును జారీ చేయడానికి సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజరు (సీనియర్ డీఎఫ్ఎం) కె.ప్రదీప్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంటు బాలాజీ, ఇతర సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. సాధారణంగా ఇచ్చే డబ్బుకన్నా ఎక్కువ అడగటంతో సంబంధిత కాంట్రాక్టరు సీబీఐ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు గురువారం సాయంత్రం లంచం డబ్బును ఓ ఉద్యోగికి ఇచ్చాడు. అదే సమయంలో సీబీఐ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈ అవినీతిలో ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ బాలాజీతోపాటు మరో ఇద్దరు ఉద్యోగులను అదుపులో తీసుకున్నారు. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరుగుతున్న ఓ కార్యక్రమంలో ఉన్నారని తెలిసి.. అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయనను డీఆర్ఎం కార్యాలయానికి తీసుకువచ్చారు. డీఆర్ఎం వినీత్ సింగ్ జోనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో ఉండగా, అత్యవసరంగా పిలిపించి విషయాన్ని తెలియజేశారు. గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు కూడా సమాచారం అందజేశారు. ఆ తర్వాత డీఆర్ఎం సమక్షంలో అకౌంట్స్ శాఖ సిబ్బందిని మీటింగ్ హాల్‌కు రప్పించి, నిందితులను విచారించారు. సీనియర్ డీఎఫ్ఎం ఇంటికి రాత్రి 7 గంటల సమయంలో కొందరు సీబీఐ అధికారులు వెళ్లి, ఆయన సతీమణి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంటిని సోదా చేసేందుకు ఇతర అధికారుల కోసం వేచి ఉన్నారు. డీఆర్ఎం కార్యాలయంలో సీబీఐ అధికారులు రాత్రి తొమ్మిది గంటల వరకూ విచారించారు. ఆ తర్వాత రిపోర్టు రాసే పనిలో పడ్డారు.

సమస్యలు లేని హాస్టళ్లుగా తీర్చిదిద్దాలి

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు

అధికారులకు మంత్రి సవిత ఆదేశం



సమస్యలను మంత్రికి విన్నవిస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, జూలై 4: రాష్ట్రవ్యాప్తంగా సమస్యలు లేని హాస్టళ్లుగా తీర్చిదిద్దాలని బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లాకు చెందిన బీసీ వెల్ఫేర్ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో విద్యార్థులపట్ల అశ్రద్ధ వహించారని, తెలుగుదేశం పాలనలో హాస్టల్ విద్యార్థులపట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులను తల్లి దండ్రులు ప్రైవేట్ బడుల్లో చదివించలేక ప్రభుత్వ పాఠశాలలో, హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలుంటాయన్న నమ్మకంతో విద్యార్థులను వదిలి వెళ్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సరైన విద్యాబోధనతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు. పలువురు వార్డెన్లు మంత్రితో మాట్లాడుతూ ఆరు నెలలకు సంబంధించి ప్రొవిజన్ బకాయిలు ఉన్నాయని వాటిని ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాబీసీ వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్‌లు ధర్మవరం రాజకుళ్లాయప్ప, బాలాజీ, సుబ్బరాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు ఇవేనా..?

- లీజుదారులను ప్రశ్నించిన సీఈసీ
- నేడు మైనింగ్ లీజుదారులతో సమావేశం

బళ్లారి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీ-కర్ణాటక సరిహద్దులో గనుల సరిహద్దులను గుర్తించేందుకు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ (సీఈసీ) చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో లీజుదారులతో కలిసి గురువారం బళ్లారి జిల్లా పరిధిలోని గనుల ప్రాంతంలో పర్యటించింది. 'మీరు లీజ్ పొందిన ప్రాంతంలో అప్పట్లో ఉన్న సరిహద్దు రాళ్లు ఇవేనా..? అప్పుడు ఇప్పుడు ఇలాగే ఉన్నాయా.. లేదా..?' అని లీజుదారులను సీఈసీ విచారించింది. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఏడు గనులను 1968లో కొందరు లీజుకు తీసుకున్నారు. బీఎంటీ, హెచ్‌టీ, ఎన్ఆర్, టీఎస్ఆర్, వీఎంపీసీ, ఎస్ఎంసీ, బీఎంసీ కంపెనీలు ఇక్కడ మైనింగ్ నిర్వహించేవి. ఇవన్నీ బళ్లారి జిల్లా భూభాగంలో ఉన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం కారణంగా గనుల తవ్వకాలను నిలిపేశారు. ప్రస్తుతం రాష్ట్రాల సరిహద్దుల గుర్తింపు విషయం జోలికి వెళ్లకుండా, కర్ణాటక భూభాగంలో ఉండే ఏడు గనులు సరిహద్దుల గుర్తింపునకు సీఈసీ సర్వే చేస్తోంది. నెల రోజుల క్రితం గనుల సరిహద్దుల పై సర్వే నిర్వహించింది. తాజాగా లీజుదారులను గనుల ప్రాంతంలోకి పిలిపించి.. గుర్తుల గురించి ఆరా తీసింది. సీఈసీకి నేతృత్వం వహిస్తున్న గోయల్‌తో పాటు కర్ణాటక, ఏపీ అటవీ శాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ, సర్వే లాండ్ రికార్డ్సు శాఖ అధికారులు హాజరయ్యారు. కాగా, 1968లో ఇనుప గనులను రాష్ట్రాల సరిహద్దులో ఉండే గ్రామాల సరిహద్దుల ఆధారంగా మైనింగ్ లీజ్‌కు ఇచ్చారని లీజు దారులు అధికారులకు తెలిపారు. మైనింగ్ లీజ్ బౌండరీలు గుర్తించాలంటే రాష్ట్రాల సరిహద్దులు నిర్ధారణ కావాలని ఎస్.రత్నయ్య(ఎన్ఆర్), టీఎస్ఆర్ మైనింగ్ లీజుదారులు అధికారులకు వివరించారు. ఈ విషయంలో మరింత పురోగతి సాధించేందుకు మైనింగ్ లీజుదారులతో శుక్రవారం డోనిమలైలో సమావేశం నిర్వహించనున్నారు. సీఈసీ, రెండు రాష్ట్రాల అటవీశాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ, సర్వే లాండ్ రికార్డ్స్ అధికారులు సమావేశంలో పాల్గొంటారు. లీజు పొందిన ఏడు గనుల హక్కుదారులు రికార్డులతో హాజరు కావాలని సీఈసీ సూచించింది.



సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

చీనీ, టమోటా ధరలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18,500, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలు పలికాయని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 604 టన్నుల చీనీకాయలు వచ్చాయని అన్నారు.

● కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠ ధర రూ.35, సరాసరి రూ.29, కనిష్ఠ ధర రూ.22 పలికాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. 600 క్వింటాళ్ల టమోటా మార్కెట్‌కు వచ్చాయి.

విద్యుత్ తీగలకు మరమ్మతులు



విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

గాండ్లపెంట, జూలై 4: స్థానిక కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలోని ఓ వీధిలో ఇళ్ల వద్ద తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ప్రమాద కరంగా ఉన్నాయి. దీనిపై పలుమార్లు స్థానికులు.. విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీనిపై గురువారం ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు ఆ వీధిలో కిందికి వేలాడుతున్న వైర్లను పైకి లాగి మరమ్మతులు చేశారు. దీంతో ఆ వీధి వారు హర్షం వ్యక్తం చేశారు.

ఆగస్టు 31లోగా రెన్యువల్ చేసుకోండి

కొత్తచెరువు, జూలై 4: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (2023 డిసెంబరులో జరిగిన) పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ఏడాది ఆగస్టు 31లోగా స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రెన్యువల్ చేసుకోవాలని జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2020-21, 2021-22 సంవత్సరాల్లో స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు కూడా తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వన్‌టైం రిజిస్ట్రేషన్ యాప్‌ను ప్రవేశపెట్టిందని కావున రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఎస్‌సీహెచ్‌ఓఎల్‌ఏఆర్ఎస్‌హెచ్‌ఐటీఎస్.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మహిళ ఆత్మహత్య

కొత్తచెరువు/ పుట్టపర్తి రూరల్, జూలై 4: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకుంది. బుక్కపట్నం చెరువులో నడిమికొండ వద్ద ఓ మహిళ మృతదేహం నీటిపై తేలుతూ ఉండటాన్ని గురువారం గమనించిన మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 7.30 సమయంలో పోలీసులు.. మహిళ మృతదేహాన్ని వెలికితీశారు. పుట్టపర్తి మునిసిపాలిటీలో వాటర్‌మన్‌గా పనిచేస్తున్న నాగరాజు భార్య గొల్లపల్లి రజిత(46)గా గుర్తించారు. ఆమె వద్ద ఉన్న సూసైడ్‌నోట్ స్వాధీనం చేసుకున్నారు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కారనీ, అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో తెలిపారు. ఆమెకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పెనుకొండకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారమేష్ తెలిపారు.

మన్యంవీరుడు అల్లూరికి నివాళి


ధర్మవరం గ్రంథాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న అధికారులు

ధర్మవరం, జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు మన్యంవీరుడు అల్లూరిసీతారామరాజు జయంతిని స్థానిక గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు. పట్టణంలోని తారకరామాపురం వద్ద ఉన్న కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడకలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు భువనేశ్వరి, గోపాల్‌నాయక్, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, పుష్పవతి, సరస్వతి, ఆనంద్, సౌజన్య, హైమవతి పాల్గొన్నారు. అలాగే బీజేపీ చేనేత సెల్ రాష్ట్ర సభ్యుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు జల్లాకార్తీక్, పుట్లూరు నరసింహులు, ప్రసాద్, లింగంపరమేశ్, గూడూరు నారాయణస్వామి, పురందరదాసు పాల్గొన్నారు.

బుక్కపట్నం: స్థానిక సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపల్ మగ్బుల్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి ఓబులేసు, శ్రీనివాసులు, రాజుమహమ్మద్, దస్తగిరి, గంగరాజు పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు ...


వివేకానందని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నల్లమాడ : స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా స్థానిక వాసి బుట్టి నాగ భూషణనాయుడు నివాసంలో వివేకానంద చిత్రపటానికి పలువురు పూలమాలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మంజునాథ్‌రెడ్డి, హనుమంతురెడ్డి, ప్రతాప్, క్రిష్టప్ప, ప్రభాకర్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ హయంలోనే వడ్డెర్లకు పెద్దపీట

ముదిగుబ్బ, జూలై 4: తెలుగుదేశం పార్టీలోనే వడ్డెర్లకు పెద్దపీట వేశారని ముదిగుబ్బ మండల వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కేతన వెంకటపతి పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో వడ్డెర్లకు చేసిందేమిలేదని, ఉత్తుత్తి చైర్మన్ పదవులు ఇచ్చి వారికి కుర్చీలు కూడా లేకుండా చేసిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం వడ్డెర్లను ఓటు బ్యాంకుగానే చూసిందని, జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో వడ్డెర్లను ఎస్టీలలో చేరుస్తానని హామీలు ఇచ్చారని, దాన్ని అమలు చేయకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వడ్డెర నాయకులు కేతన ఆంజనేయులు, పెద్దన్న, ఆంజనేయులు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ

పుట్టపర్తి, జూలై 4: సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై విదేశీ స్కాలర్స్‌తో గురువారం శిక్షణ ఇప్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సెందిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీకి చెందిన రీసెర్చు స్కాలర్ కొంద్రాజ్ జలార్‌తో ఈ శిక్షణ ఇప్పించామన్నారు. ఆరునెలలపాటు విదేశీ స్కాలర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంటు ఫ్యాకల్టీ ఆన్‌లైన్ గేమింగ్, ఆటోమేషన్‌లపై ఈ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు విదేశాలకు వెళ్లేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విదేశీ స్కాలర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ బాలకోటేశ్వరి పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..!

కదిరి, (అమడగూరు), జూలై 4: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోయింది. దాని నుంచి వచ్చే దుర్వాసనతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగల అధికమై రోగాల బారిన పడుతున్నారు. డయేరియా తీవ్రంగా వ్యాపిస్తోందని... ఇలాంటి సమయంలో పరిశరాల పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న చెత్త

పరిశుభ్రతతోనే అతిసార నియంత్రణ



పుట్టపర్తిలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది, నిడిమామిడిలో పునరావాస పరికరాలను అందుకున్న ఫ్లోరోసిస్ బాధితులు

పుట్టపర్తిరూరల్, జూలై 4 : అతిసార నియంత్రణ (డయేరియా)లో పరిసరాల పరిశుభ్రత, శారీరక, వ్యక్తిగత, పరిశుభ్రతలే ప్రధానమని డిస్ట్రిక్ట్ సర్వేలెన్సర్ ఆఫీసర్ డాక్టర్ కేసీకే నాయక్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో జిల్లా స్థాయి వైద్యసిబ్బందితో కలసి ఆయన స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటి పరిధిలోని ఎస్బీఐ రోడ్, చిత్రావతి రోడ్, వివేకానందరరోడ్, ఎనుములపల్లి తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో పట్టణంలో ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఆశాలకు స్టాప్ డయేరియా సీజనల్ వ్యాధులపై పలు సూచనలు చేశారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు డయేరియా లక్షణాలు, చికిత్స ఓఆర్ ఎస్ ద్రావణం, జింక్ మాత్రల ప్రాధాన్యత విని యోగంపై వివరించారు. జిల్లా ఎపిడామిలాజిస్టు బాలాజీ మాట్లాడుతూ.. పట్టణంలో డ్రైనేజీ, తాగునీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మునిసిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరం బాధితుల వివరాలు, 12 నీటి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మునిచంద్రిక, సీహెచ్ఓ నగేష్, మునిసిపల్ సిబ్బంది, ఏఈలు స్వాతి, అశోక్, రాజేష్, ఎంపీహెచ్ఈఓ వెంకట రమణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సోమశేఖర్, ఆరోగ్యకార్యకర్తలు అజీజ్‌ఖాన్, ముంజుల పాల్గొన్నారు.

నిడిమామిడిలో అవగాహన..

జాతీయ ఫ్లోరోసిస్, అతిసార నియంత్రణ, అడల్ట్ బీసీజీ, సీజనల్ వ్యాధులపై పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ జోత్స్న గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలను అందచేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, బాధితులను గుర్తించి వారికి రక్త మూత్ర పరీక్షల నిమిత్తం నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపామన్నారు. అవసరమైన వారికి పునరావాస సహాయక చర్యలు చేపట్టామన్నారు. దానిలో భాగంగా నడుము బెల్టులు, మెడకు బెల్టులు, వాకర్లు అందించామన్నారు. అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తా మన్నారు. అనంతరం అడల్ట్ బీసీజీ వ్యాక్సీన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంఎల్ హెచ్‌పీ సుస్మిత, ఆరోగ్యకార్యకర్తలు శివ, మంజులవాణి, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..!



ముదిగుబ్బ మండలం రామస్వామితండాలో రోడ్డుపై నిలిచిన మురుగు, నల్లమాడలోని బీసీ కాలనీ వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

ముదిగుబ్బ, జూలై 4: ఈ ఫొటోలు ఉన్నది మురుగు కాలువ అనుకుంటే మీరు పొరబడినట్లే. ఇది ముదిగుబ్బ మండలం రామస్వామితండాలో పెద్దమ్మ గుడికి వెళ్లే రహదారి. అయితే ఈ రోడ్డుపై నిత్యం మురుగు ఇలా నిల్వ ఉంటోంది. కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు ఇలా నిల్వ ఉంటోంది. రోడ్డంతా అపరిశుభ్రంగా మారుతోంది. ఇలా రోడ్డుపై నీటి నిల్వ వల్ల వాహనదారులు, పాదచారులు తరచూ ప్రమాదాలకు గురై, గాయాలపాలవుతున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ఆ తండావాసులు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై ఈఓఆర్డీ కృష్ణకుమార్‌ను వివరణ కోరగా.. కాలువ ఏర్పాటు చేసేందుకు నివేదిక పంపుతున్నామని, సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

నల్లమాడ, జూలై 4 : స్థానిక ఆర్టీసీ సమీపంలోని బీసీ కాలనీలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఆ నీరు నిల్వ ఉండి.. దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకండా దోమలు విపరీతంగా పెరగడంతో ఆ కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. పాతబాలాజీ ప్రైవేటు పాఠశాల వద్ద మురుగునీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ పాఠశాల సిబ్బంది వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం


ధర్మవరంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు


కదిరిలో డిగ్రీ కళాశాలను బంద్ చేయించిన నాయకులు

ధర్మవరం, జూలై 4: నీట్ పరీక్షను రద్దు చేయాలి, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఆపాలి.. తదితర డిమాండ్లతో గురువారం పలు విద్యార్థిసంఘాల నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ మేరకు పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, పీడీఎస్‌యూ జిల్లాకార్యదర్శి నిరంజన్‌యాదవ్ తదితరులు పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి విద్యార్థులను బయటకు పంపి బంద్ చేయించారు. అంతకు మునుపు కళాజ్యోతి సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతుందని చెప్పడంతో వారు ధర్నా విరమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... నీట్ పరీక్షను రద్దు చేయాలని, ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, విద్యార్థిసంఘాల నాయకులపై ఉన్న అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి విద్యావ్యవస్థ పూర్తిగా నాశనమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, గణేశ్, నందకిశోర్ పాల్గొన్నారు.

కదిరిఅర్బన్ : నీట్ పరీక్షా పేపర్ లీక్‌కు కారణమైనవారిని శిక్షించాలని గురువారం దేశ వ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ కదిరిలో విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను విద్యార్థి సంఘా నాయకులు బంద్ చేయించారు.

తనకల్లు: నీట్ పరీక్షలు రద్దు చేయాలని స్థానిక శ్రీగోవింద నరసింహారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తరగతులు బహిష్కరించి, బంద్ పాటించారు. ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు జ్ఞానేంద్ర మాట్లాడుతూ.. నీట్‌లో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.30 లక్షలు వసూలు చేసి, పేపర్ లీక్ చేశామని బహిరంగంగా చెబుతున్నవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రదాన్ రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, గని, విజయ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు గురువారం బంద్ నిర్వహించారు. ఐక్యవిద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈ బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, టీడీ ఎస్‌యు, ఏఐఎస్ఏ, ఎన్‌హెచ్‌యుఐ, పీడీఎస్ఓ, విద్యార్థిసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం బంద్ చేశారు. నీట్ పేపర్ లీక్‌కు కారకులను శిక్షించాలని, పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానం రద్దు చేయాలని, విద్యార్థిసంఘాలపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.



సజ్జలు పంపిణీ చేస్తున్న అధికారులు

మహిళారైతులకు సజ్జల పంపిణీ

కదిరిఅర్బన్, జూలై 4: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం మహిళారైతులకు ఉచితంగా సజ్జలు పంపిణీ చేశారు. రైతు ఉత్పత్తి దారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో ఒకటిన్నర కేజీ ప్యాకెట్లను రైతుకు ఒకటి చొప్పున అందించారు. ఎఫ్‌పీఓ ఏపీఎం చిన్న వెంకటప్ప మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మహిళల కోసం వ్యవసాయ ఆధారిత యూనిట్లు నెలకొల్పి వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా రైతుల ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా చిరుధాన్యాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి డివిజన్‌లోని ఏపీఎంలు, సీసీలు, మహిళ రైతులు పాల్గొన్నారు.

'విత్తు' కార్యక్రమంలో రైతులు


విత్తన శుద్ధి చేస్తున్నరైతు

తనకల్లు, జూలై 4: మండలంలో రెండు రోజుల క్రితం అరకొర వర్షం పడడంతో రైతులు పొలాల్లో విత్తువేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు విత్తు వేయడానికి సరైన సమయంగా అటు శాస్త్రవేత్తలు, రైతులు భావిస్తున్నారు. మండలవ్యాప్తంగా వర్షం పడిన గ్రామాల్లో విత్తే కార్యక్రమం చేపట్టారు. విత్తన శుద్ధిని కూడా బీజామృతంతో చేసి, విత్తుతున్నారు. జనజాగృతి ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా చిరు, నవధాన్యాలు పంపిణీ చేశారు. కాగా, తవళం, గేమేనాయక్‌తండా, మల్లిరెడ్డిపల్లి, చీకటిమానుపల్లి పంచాయతీల్లో ఎంపిక చేసిన 19 గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో నవ, చిరుధాన్యాలు సాగుచేయడానికి జనజాగృతి రైతులతో ఒప్పందాలను చేసుకుంటోంది. దీంతో పలువురు రైతులు తమ బీడు భూములను సాగులోకి తెచ్చే ప్రయత్నాలు ప్రారంభించారు.

వరినారు మడులపై అవగాహన

బుక్కపట్నం, జూలై 4: వరి నారు మడుల్లో సంభవించే తెగుళ్ల, సస్యరక్షణపై స్థానిక రైతులకు ఏడీఏ సనావుల్లా, ఏఓ సతీష్ బాబు గురువారం అవగాహన కల్పించారు. నారుమడుల్లో కలుపు నివారణకు నిమినీగోల్డు ఏ విధంగా పిచికారి చేయాలి... సస్యరక్షణకు కీటక రక్షణకు ఎలా గులికలు చల్లాలన్న వాటిపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




నల్లలమ్మ దేవాలయాన్ని తెరిపించి పూజలు చేయిస్తున్న కూటమి నేతలు

మంత్రి చొరవ.. తెరుచుకున్న ఆలయం

ధర్మవరంరూరల్, జూలై 4: గత వైసీపీ పాలనలో అరాచకాలు, అధిపత్యపోరు తారస్థాయికి చేరడంతో దేవుళ్ల గుడిని సైతం మూయించేశారు. మంత్రి సత్యకుమార్ చొరవతో నాలుగేళ్లుగా మూతపడిన నల్లలమ్మ దేవాలయ తలుపులు తిరిగి తెరుచుకున్నాయి. మండలంలోని గొట్లూరు ఎస్సీ కాలనీలో నల్లలమ్మ దేవాలయం ఉంది. పలుకేసుల్లో నిందితులుగా ఉన్న వైసీపీ కార్యకర్తలు.. దేవాలయంలో తమ వర్గానికి చెందినవారే పూజ పెట్టాలని పట్టుబట్టారు. ఆధిపత్యపోరు కారణంగా ఆలయాన్నే మూసివేయించారు. వారి తీరుపై అప్పట్లో గ్రామస్థులు మండిపడ్డారు. కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ఎన్నికల ముందు గ్రామానికి వెళ్లినపుడు విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి అరాచకవాదులను సహించేది లేదనీ, తొందరలోనే అమ్మవారి ఆలయాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు గురువారం మంత్రి కార్యాలయం సిబ్బందితో కలిసి గ్రామస్థులు నల్లలమ్మ దేవాలయ తలుపులను తెరిపించారు. గ్రామదేవతైన అమ్మవారికి పూజలు చేయించారు. దీంతో కాలనీవాసులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు దేవాలయాలను సైతం భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. ఆలయాల జోలికొస్తే ఎంతటివారినైనా సహించేది లేదని హెచ్చరించారు.

బకాయిదారులపై కేసులు పెట్టండి

కొత్తచెరువు పంచాయతీ కార్యదర్శికి డీపీఓ ఆదేశం


పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిస్తున్న డీపీఓ

కొత్తచెరువు, జూలై 4: మండల కేంద్రంలోని దిన, వారపు సంతలు, బస్టాండు వేలంపాట పాడి పంచాయతీకి డబ్బు చెల్లించని వారిపై కేసులు పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) విజయ్‌కుమార్.. పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డికి ఆదేశించారు. స్థానిక పంచా యతీని డీపీఓ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డీపీఓ మాట్లాడు తూ.. మండలకేంద్రంలో 2021 సంవత్సరంలో వారపుసంతకు సంబంధించి బెస్త నాగలక్ష్మి రూ.2.60 లక్షలు, 2022-23లో మొర్రప్పగారి మల్లికార్జున రూ.2.76 లక్షలు, 2023-24లో వడ్డే నారాయణ రూ.8.35లక్షలు, డైలీ మార్కెట్‌కు సంబధించి 2021-22లో వెంకటరాముదు రూ.21వేలు, 2023-24లో వంశీకృష్ణ రూ.4.78 లక్షలు, బస్టాండ్‌కు సంబంధించి 2021-22లో చిన్ననరసింహులు రూ.61వేలు, 2022-23లో బెస్త నాగలక్ష్మి రూ.5.75లక్షలు, 2023-24లో పనసబొట్ల బాబు రూ.6.71లక్షల బకాయిలు ఉన్నారనీ, వీరిపై కేసులు నమోదు చేయించాలని సెక్రటరీకి ఆదేశించారు. పంచాయతీ గదుల అద్దెల బకాయి రూ.28.26 లక్షలు ఉందనీ, చెల్లించని వారికి నోటీసులు ఇచ్చి, కేసులు నమోదు చేయించాలని డీపీఓ ఆదేశించారు.

పేద కుటుంబానికి ఆపన్నహస్తం


మహిళకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి రూరల్, జూలై 4: భర్తను కోల్పోయి నలుగురు చిన్నారులతో పూటగడ వక ఇబ్బందు లు పడుతున్న ఓ బీహార్ మహిళకు ప్రభుత్వ ఉద్యోగులు ఆపన్న హస్తం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన భార్య, భర్త తమ నలుగురు పిల్లలతో బతుకుతెరువు కోసం పుట్టపర్తికి వచ్చారు. పిల్లలందరూ పది సంవత్సరాలలోపు వారే. కూలీనాలీ చేసుకుంటు ప్రశాంతి నిలయం వెస్టుగేట్ సమీపంలో ఉండేవారు. కుటుంబ పెద్ద అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో ఆ కుటుంబం చెట్టుకిందకు చేరింది. పూటగడవక తల్లి, పిల్లలు ఇబ్బందులు పడసాగారు. పిల్లలను విడిచి కూలికి వెళ్లలేక, కూలికి వెళ్లకపోతే పూటగడవక, ఎవరికైనా చెప్పుకుందామంటే భాష రాక ఆ తల్లి మనోవేదనకు గురయ్యేది. ఆమె పరిస్థితిని గమనించిన కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకువచ్చారు. దీనజనోద్ధరణ భవన సముదాయంలో ఉన్న జిల్లా పరిశ్రమలశాఖ ఉద్యోగి గోవిందు, బీసీ వెల్ఫేర్ ఉద్యోగి ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూ కార్యాలయం ఉద్యోగి గోపాలక్రిష్ణ, చేనేత శాఖ ఉద్యోగి సుధాకర్, డీఏఏటీటీసీ ఉద్యోగి అంజినమ్మ డ్రైవర్ సంతోష్ ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.20 వేలు సేకరించి.. గురువారం ఆ తల్లికి అందజేశారు.

మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు


అభిలాష్‌కు చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లమాడ, జూలై 4: నల్లమాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో టెన్త్ చదిన విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు. గురువారం తోటి విద్యార్థిని భారతి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో... ఆమె కుమారుడు అభిలాష్ చదువు కోసం రూ.47 వేలను అందజేశారు. మిత్రుడు మూడే రవినాయక్ తన చారిటబుల్ ట్రస్ట్ అయిన హార్ట్ టూ హెల్ప్ ద్వారా రూ. 20వేలు, మిగిలిన విద్యార్థులందరూ కలిసి రూ.27 వేలు మొత్తం రూ.47 వేలు అందించారు. దీంతో భారతి తొటి స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మణ, పూర్వ విద్యార్థులు రవినాయక్, రమేష్, మనోహర్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రాహుల్ క్షమాపణ చెప్పాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, జూలై 4: పార్లమెంట్ సమావేశాల్లో హిందువులను కించపరిచే విధంగా మాట్లాడిన రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎన్డీఏ కార్యాలయం ఎదుట ప్లకార్డులు చేత పట్టుకుని నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ... హిందువుల పట్ల ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రతిపక్షనేత ఇలా బాధ్యతారహితంగా మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకేఓబులేసు, జింకా చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, చేనేత సెల్ రాష్ట్ర సభ్యులు గుండా పుల్లయ్య, నాయకులు గిర్రాజు రవి, పుట్లూరు నరసింహులు, కార్తీక్, భక్తవత్సలం, రామశేఖర్, గరుగు మల్లికార్జున, చింతా మంజునాథ్, నాగభూషణం, కృష్ణప్రసాద్, ప్రదీప్, రమేశ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

నంబులపూలకుంట, జూలై 4: స్థానిక కేజీబీవీని కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంఈఓ గోపాల్‌కృష్ణ ఉన్నారు. పాఠశాల రిజిష్టర్లు పరిశీలించాలని అడుగ్గా.. బుధవారం తనిఖీకి వచ్చిన అడిషనల్ జీసీడీఓ సంపూర్ణ తీసుకెళ్లినట్లు తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతోపాటు, పౌష్టికాహారం అందించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు.

అజ్జయ్యస్వామికి ఘనంగా పూజలు


అలంకరణలో అజ్జయ్యస్వామి

గుడిబండ, జూలై 4: మండలంలోని తాళికెర గ్రామ సమీపంలో వెలసిన అజ్జయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి ప్రత్యేక పూలతో అలంకరించారు. బొరుగులు నైవేద్యం చేసిం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఆగస్టు 31లోగా రెన్యువల్ చేసుకోండి

కొత్తచెరువు, జూలై 4: నేషనల్‌మీన్స్‌కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్(2023 డిసెంబరులో జరిగిన) పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ఏడాది ఆగస్టు 31లోగా స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రెన్యువల్ చేసుకోవాలని పరీక్షా విభాగపు అధికారి లాజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020-21, 2021-22 సంవత్సరాల్లో స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు కూడా తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వన్‌టైం రిజిస్ట్రేషన్ యాప్‌ను ప్రవేశపెట్టిందని కావున రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌సీహెచ్‌ఓఎల్‌ఏఆర్‌ఎస్ హెచ్‌ఐటీఎస్.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటింటికీ వెళ్లి బీసీజీ వ్యాక్సిన్ వేయాలి

రాష్ట్ర పరిశీలకుడు శశికాంత్


రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు

లేపాక్షి, జూలై 4: బీసీజీ వ్యాక్సిన్‌ను ఇంటింటికి వెళ్లి సర్వేచేసి వేయాలని రాష్ట్ర పరిశీలకుడు శశికాంత్ అన్నారు. ఆయన గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రతి ఇంటికి సర్వేచేసి బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి వెంకట చిరంజీవి, సిబ్బంది సుబ్రహ్మణ్యం, ప్రసాద్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చలివెందుల కొండ అభివృద్ధికి చర్యలు

హిందూపురం, జూలై 4 : దేశంలోనే అతిపెద్ద రాతి శాసనం ఉన్న చలివెందుల గవి రంగనాథస్వామి కొండను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృఢనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర తెలిపారు. ఆయన గురువారం గవి రంగనాథస్వామి కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలోనే ఎమ్మెల్యే కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తారని తెలిపారు. అలాగే మూడు శాఖల అధికారులను కొండవద్దే సమావేశ పరిచేందుకు బాలకృష్ణ ఇప్పటికే ముఖ్య అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్ధనారాయణ రెడ్డి, ఫారెస్ట్ అధికారులు శ్రీనివాస్, అక్బర్, నాయకులు, పాల్గొన్నారు.

19న గురుపూజోత్సవం

హిందూపురం అర్బన్, జూలై 4 : యోగినారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో కైవారంతాతయ్య గురుపూజ మహోత్సవాన్ని ఈనెల 19, 20, 21తేదీల్లో పట్టణంలోని కైవారం తాతయ్య మఠంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం హిందూపురంశాఖ అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజ్యలక్ష్మీ మోహన్, పార్థసారథి, ఆకుల ఉమేష్, నిమ్మకాయల రామాంజి తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా భాస్కర్

మడకశిర(అమరాపురం), జూలై 4: అమరాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న భాస్కర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ మునిస్వామి ఈనెల 30వ తేదీన పదవీ విరమణ పొందారు. దీంతో కార్యాలయంలో ఏఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న భాస్కర్‌కు ఫుల్ అడిషనల్ ఎంపీడీఓగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

అగళి/రొళ్ల, జూలై 4 : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అగళి, రొళ్ల మండలాల్లోని చిన్న, సన్న కారు రైతులు డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయా మండలాల ఏపీఓలు శివన్న, ఓబుళేశు తెలిపారు. ఈ మేరకు వారు వేర్వేరుగా ప్రకటనలు చేశారు. ఆసక్తికలిగిన రైతులు జాబ్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం వన్‌బీ నఖలు, చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం నఖలుతో ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. రైతులు మామిడి, జీడిమామిడి, చీనీ, నిమ్మ, జామ, తైవాన్‌జామ, సపోటా, కొబ్బరికాయ, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, రేగు, డ్రాగన్‌ఫ్రూట్, గులాబీపూల తోటల పెంపకం చేపట్టవచ్చన్నారు.

'సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకోండి'

పెనుకొండ టౌన్, జూలై 4: దివ్యాంగులు ధృవపత్రాలు పొందడానికి సదరం క్యాంపు కోసం శుక్రవారం నుంచి గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన గురువారం పట్టణంలోని గ్రామ సచివాలయం లో టీడీపీ నాయకులతో కలిసి సదరం క్యాంప్ గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు పూల శ్రీనివాసులు, చంద్రకాంతమ్మ తదితరులు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

కొత్తచెరువు/ పుట్టపర్తి రూరల్, జూలై 4: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకుంది. బుక్కపట్నం చెరువులో నడిమికొండ వద్ద ఓ మహిళ మృతదేహం నీటిపై తేలుతూ ఉండటాన్ని గురువారం గమనించిన మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 7.30 సమయంలో పోలీసులు.. మహిళ మృతదేహాన్ని వెలికితీశారు. పుట్టపర్తి మునిసిపాలిటీలో వాటర్‌మన్‌గా పనిచేస్తున్న నాగరాజు భార్య గొల్లపల్లి రజిత(46)గా గుర్తించారు. ఆమె వద్ద ఉన్న సూసైడ్‌నోట్ స్వాధీనం చేసుకున్నారు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కారనీ, అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో తెలిపారు. ఆమెకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పెనుకొండకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారమేష్ తెలిపారు.

వ్యవసాయ బోర్ల కేబుల్ బోరీ

మడకశిర రూరల్, జూలై 4: మండలంలోని అయ్యావారిపల్లి, సింగేపల్లిలకు చెందిన నరసింహమూర్తి, నరసంహరెడ్డి వ్యవసాయ బోర్లకు అమర్చిన 140 మీటర్ల కేబుల్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధిత రైతులు తెలిపారు. రైతు నరసింహమూర్తి మాట్లాడుతూ... సాగు చేసిన పంటలు నీటి తడిలేక ఎండిపోకుండా కాపాడుకోవడానికి రూ.10 వేలు అప్పు చేసి కొత్త కేబుల్ ను తెచ్చి బోరు మోటారుకు అమర్చామని తెలిపారు. అదే విధంగా సింగేపల్లికి చెందిన రైతు నరసింహరెడ్డి వ్యవసాయ బోరు కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని రైతులు గురువారం మడకశిర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు

ఇంట్లో చోరీకి యత్నం

హిందూపురం, జూలై 4: పట్టణంలోని దండురోడ్డు ప్రాంతంలో నివాసమున్న న్యాయవాది నారాయణగౌడ్ ఇంట్లో చోరీకి దుండగులు బుధవారం రాత్రి యత్నించారు. నారాయణగౌడ్ ఇంట్లోని కింది భాగంలో కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అర్ధరాత్రి దాటాక దొంగలు కార్యాలయం తాళాలు పగులకొట్టి గదిలోకి వెళ్లారు. అయితే అందులో కోర్టుకు సంబంధించిన పుస్తకాలు, పత్రాలు ఉండటంతో వెళ్లిపోయారు. దీనిపై ఆయన గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

మార్కెట్‌కు త్వరలో మహర్దశ

దారి ఏర్పాటుపై దృష్టిపెట్టిన ఎమ్మెల్యే


కూరగాయల మార్కెట్‌కు అడ్డంగా వెలసిన దుకాణాలు

మడకశిరటౌన్, జూలై 4: మడకశిర మధుగిరి సర్కిల్‌లో ఉన్న కూరగాయల మార్కెట్‌కు దారి లేకపోవడంతో విక్రయదారులు, కొనుగోలుదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మార్కెట్ లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా అటుగా వెళ్లే దారులకు అడ్డంగా రోడ్డుపై ఇష్టాను సారంగా బంకులు ఇతర దుకాణాలు నిర్వహించేవారు. ఈ విషయాన్ని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకపోయిందని పలువురు వినియోగ దారులు, విక్రయదారులు విమర్శించారు. రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొన్న వారివద్ద కూడా చేతివా టం ప్రదర్శించి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇటీవలే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సంత మార్కెట్‌ను సందర్శించారు. కూరగాయల విక్రయదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై వెంటనే స్పందించారు. విక్రయదారుల వద్ద నిలువు దోపిడీ చేస్తున్నారని, వెంటనే సుకం వసూలు కాంట్రాక్టు రద్దు చేసి మరొకరికి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అధికారుల తీరుపట్ల మండిపడ్డారు. వారపు సంత ప్రస్తుతం దినసరి మార్కెట్ కావడం వల్ల ఉదయం మార్కెట్‌కు విక్రయదారులు తెచ్చే లోడ్‌ను సైతం అన్‌లోడ్ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ఇలా అయితే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌కు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న రేకుల షెడ్లను తొలగించాలని ఆదేశించారు. అలాగే గత టీడీపీ హయాంలో మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి నగర పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రజా ప్రతినిధులు ఐదేళ్ల పాటు అటువైపు కన్నెత్తి చూడలేదనే విమర్శలున్నాయి. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో నగర పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. నగర పంచాయతీ ఆదాయం పెంచేందుకు అవసరమైన చోట్ల షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి శాశ్వత ఆదాయ వనరుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. దీంతో కూరగాయల విక్రయదారులు, పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీకి మంచి రోజులు వస్తున్నాయని పేర్కొంటున్నారు.

మార్కెట్‌కు దారి లేక ఇబ్బందులు



మడకశిరలోని వారపు సంత, డైలీ మార్కెట్‌కు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మార్కెట్‌కు వచ్చారు. మేము ఎదుర్కొంటున్న సమస్యలను వారికి తెలిపాము. అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల మార్కెట్‌లోకి వ చ్చేందు కు దారి లేకుండా పోయింది. దీంతో కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. కర్ణాటక రాష్ట్రం పావగడ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడ విక్రయిం చేందుకు కూరగాయలు తీసుకొస్తాం. అయితే వాటిని మార్కెట్‌కు చేర్చేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. త్వరలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ చొరవ తీసుకొని మార్కెట్‌కు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలి.

- రామలక్ష్మి, కూరగాయల వ్యాపారి, పావగడ.

రాకపోకలకు ఒకే దారి..



మడకశిర మార్కెట్‌కు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోజూ కూరగాయలను మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తాం. రాకపోకలకు ఒకే దారి ఉండడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాహనంలో నుంచి కూరగాయలను మార్కెట్‌లోకి చేర్చేందుకు చాలా అవస్థలు పడుతున్నాం. అలాగే గురువారం జరిగే వారపు సంతలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొనుగోలు దారులు వచ్చేందుకు, కూరగాయలు మోసుకెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఇటీవలే మార్కెట్‌కు వచ్చారు. మా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తే కొనుగోలు దారులు, విక్రయదారులు పడుతున్న ఇబ్బందులు తొలుగుతాయి.

-రత్నమ్మ, కూరగాయల వ్యాపారి, మడకశిర

పదివేల హెక్టార్లకుపైగా వేరుశనగ సాగు : ఏడీ

మడకశిర, జూలై 4: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు నియోజకవర్గంలో పదివేల హెక్టార్లకుపైగా వేరుశనగ సాగైందని వ్యవసాయ శాఖ ఏడీ కృష్ణమీనన్ తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీ గురువారం మాట్లాడుతూ... నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 28వేల హెక్టార్లని తెలిపారు. అందులో ఇప్ప టికే పదివేల హెక్టార్లకు పైగా వేరుశనగ సాగైందన్నారు. ఈ యేడు జూలై15 వరకు వేరుశనగ సాగుకు గడువు ఉందని తెలిపారు. ఇంకా వర్షాలు పడేవ అవకాశాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో వేరుశనగ సాగ వుతుందన్నారు. ఇప్పటివరకు నియోజకర్గంలోని మడకశిర మండలంలో 2800 హెక్టార్లు, అమరాపురం మండలంలో 3100 హెక్టార్లు, గుడిబండ లో 2900, రొళ్లలో 1211, అగళి మండలంలో 275 హెక్టార్లలో రైతులు వేరుశనగ పంటను సాగు చేశారని ఆయన వివరించారు.

టీడీపీలోకి కౌన్సిలర్ చేరిక


సుధాకర్‌నాయక్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జూలై 4: మడకశిర నగర పంచాయతీ రెండోవార్డు కౌన్సిలర్ సుధాకర్‌నాయక్ గురువారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులు ఉండగా ఇప్పటికే వైసీపీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారు. దీంతో టీడీపీ బలం 11కు చేరింది. ఈసందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధి కోసం టీడీపీలో చేరినట్లు తెలిపారు. గుండుమల తిప్పేస్వామి ఆయనకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు నరసింహరాజు, హనుమంతు, ఉమాశంకర్, శ్రీనివాసులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.

నల్లమ్మ ఆలయం హుండీ చోరీ

గాండ్లపెన్న, జూలై 4: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో వెలసిన నల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి హుండీని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం భక్తులు ఆలయానికి వెళ్లి చూడగా హుండీ లేకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ గౌస్‌బాషా, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలో ఏ వస్తువులు చోరీకి గురయ్యాయని ఎస్‌ఐ గ్రామస్థులను అడిగారు. హుండీలో రూ. 10వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. దుండగల కోసం గాలింపు చర్యలు చేపట్టిన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి సవితను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


మంత్రి సవితకు మొక్కను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పెనుకొండ టౌన్, జూలై 4 : రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవితను శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ గురువారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశా రు. మంత్రిని శాలువ తో సన్మానించారు. అనంతరం గూగూడు కుళ్లాయ స్వామి ఉరుసుకు రావాలని ఆహ్వాన పత్రికను అందించారు. అలాగే శింగనమల నియోజకవర్గంలోని వసతిగృహాలు అధ్వానంగా ఉన్నాయని వాటి మరమ్మతులకు సహకరించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ రియాజ్ అహ్మద్‌పై కేసు

హిందూపురం, జూలై 4 : పట్టణ రెండో పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తూ వీఆర్‌కు వెళ్లిన రియాజ్ అహ్మద్‌పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయనతోపాటు మరో నలుగురిపై కూడా కేసు నమోదైందన్నారు. హిందూపురం టూటౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రియాజ్‌అహ్మద్ మే 25న హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న షేక్ ఇర్షాద్ బానును రెండో వివాహం చేసుకున్నాడు. అయితే మొదటి భార్యకు విడాకులు ఇచ్చానని నమ్మబలికి తనను మోసం చేయడంతో పాటు, పెళ్లి చేసుకున్న వారం నుంచే మానసికంగా, శారీరకంగా వేధించాడని సోమవారం జిల్లా ఎస్పీకి స్పందనలో ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టి సీఐ రియాజ్‌అహ్మద్‌ను అదేరోజు రాత్రి వీఆర్‌కు పంపారు. ఇర్షాద్‌బాను హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రియాజ్ అహ్మద్‌తోపాటు పెళ్లికుదిర్చిన, పెళ్లిచేసిన ఖాజీలు అబ్దుల్ మాలిక్, కదిరికి చెందిన ఖాజీ రఫీక్‌సాబ్ ముఫ్తి నిస్సార్ అహ్మద్, హఫీజ్ ఖలీద్‌సాబ్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

పాడి పశువులకు వ్యాక్సినేషన్

హిందూపురం(సోమందేపల్లి), జూలై 4 : మండలంలోని కొలిం పల్లి, పత్తికుంటపల్లి, చిన్నబాబయ్యపల్లిల్లో గురువారం పాడి పశువులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం నిర్వహించినట్లు పశువైద్యుడు బాలాజీ తెలిపారు. ఆయా గ్రామాల్లో వ్యాక్సినేషన్ దాదాపు పూర్తిచేశామన్నారు. శుక్రవారం కొనతట్టుపల్లి, తుంగోడు, కూకటిమానుపల్లి, కావేటి నాగేపల్లి ల్లో పశువులకు వ్యాక్సిన్ వేస్తామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

పెనుకొండ టౌన్, జూలై 4: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రప టానికి సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడు తూ... ఈ దేశం నాకు ఏమిచ్చిందని కాకుండా దేశానికి నేను ఏమిచ్చాననేవిధంగా అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

పెనుకొండ: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వ హించారు. బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివ రామక్రిష్ణ ఆధ్వర్యంలో పెనుకొండలో అల్లూరి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. నాయకులు వెంకటేశులు, రవికుమార్, బాబుప్రసాద్, చాలకూరు హనుమంతు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్‌లు అనురాధ, సుజాతమ్మ, పుష్పలత, యర్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అల్లూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు రామన్న, ప్రతాప్, యశోద రాణి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బహుజన చైతన్యవేదిక సభ్యులు


డిగ్రీ కళాశాలలో ప్రసంగిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ జయప్ప

పైప్‌లైన్ పగిలి నీరు వృథా

పెనుకొండ రూరల్, జూలై 4 : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం రైల్వే గేటు ఫ్లైఓవర్ వద్ద తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా వెళ్తోంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి తిమ్మాపురం, పెనుకొండ పట్టణానికి, చుట్టుపక్కల గ్రామాలకు నీటిని అందించేందుకు ఈ పైప్‌లైన్ వేశారు. గత టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీకే పార్థసారథి చొరవతో రూ. లక్షలు వెచ్చించి వేసిన ఈ పైప్‌లైన్ ద్వారా నీటిని అందిస్తున్నారు. అయితే ఇస్లాపురం రైల్వేగేటు ఫ్లైఓవర్ వద్ద కొన్ని రోజుల నుంచి తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరంతా సమీపంలోని డ్రైనేజీలోకి వెళ్తోంది. పైప్‌లైన్ పగలడంతో తిమ్మాపురం, పెనుకొండలోని పలు కాలనీవాసులు తాగునీరు చేరక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి పగిలిన పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


బ్రిడ్జివద్ద పైప్‌లైన్ పగిలి వృథా అవుతున్న నీరు

విద్యాసంస్థల బంద్ విజయవంతం


పురంలో బంద్ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం అర్బన్, జూలై 4 : విద్యారంగ సంస్థలపై విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ పట్టణంలో విజయవంతంగా ప్రశాంతంగా ముగిసింది. పట్టణ పరిధిలో గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పలు పాఠశాలలను మూయించారు. నీట్ పరీక్షా ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంద్‌ను పాటించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, నరసింహమూర్తి, తరుణ్, పవన్, జయచంద్ర, యశ్వంత్, నిహాల్, నిఖిత్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: నీట్ ప్రశ్నాపత్రాల లీకేజ్ వంటి వైఫల్యాలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన దేశవ్యాప్తబంద్‌లో పట్టణంలో విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అన్నివిద్యా సంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షా పేపర్ల లీకేజ్‌పై సమస్త దర్యాప్తు చేయించాలని, బాధ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలన్నారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, ఆది, అనీల్, మంజు, మనోజ్, సురేష్‌నాయక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: నీట్ పరీక్షల నిర్వాహణలో నేషనల్ టెస్టుఏజెన్సీ వైఫల్యాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్ గోరంట్లలో గురువారం ప్రశాంతంగా జరిగింది. ముందు జాగ్రత్త చర్యగా ప్రయివేటు పాఠశాలలు గురువారం సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ ప్రయివేటు కళాశాలలను నిర్వహిస్తుండగా, విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. గ్రామీణ పాఠశాలలు యథావిధిగా కొనసాగాయి.

'ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో బధిరులకు న్యాయం'



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బధిరసంఘం నాయకులు

హిందూపురం అర్బన్, జూలై 4: రాష్ట్ర ప్రభుత్వం పెంచి ఇటీవల అందించిన పింఛన్‌తో బధిరులకు పూర్తిగా న్యాయం జరిగిందని ఆసంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు గురువారం చంద్రబాబు, మోదీ, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇంతకు ముందు భరోసా పింఛన్ రూ.3వేలు ఇస్తుండగా ఈ ప్రభుత్వం రూ.6వేలకు పెంచడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదర్శ్, బధిర సంఘం నాయకులు ఆంజనేయప్రసాద్, మంజునాథ్, శ్రీరాములు, అల్తాఫ్, రియాజ్, నరసింహులు, రామాంజినేయులు, మాలిక్, హేమారెడ్డి తదితరులు ఉన్నారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

గోరంట్ల, జూలై 4: కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీ పార్లమెంటులో హిందూమతాన్ని కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. గోరంట్లలోని ప్రధాన రహదారిపై గాంధీ విగ్రహం వద్ద నుంచి బస్టాండ్ కూడలి వరకు గురువారం ర్యాలీ చేపట్టారు. అక్కడ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. వీహెచ్‌పీ నాయకులు, అర్చకులు దేవరాజుస్వామి, మధుసూదన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రమాపావనీరాయల్, రామకిష్టప్ప, పెనుకొండ శ్రీనివాస్, బీజేపీ మేదర శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నరేష్, హరిక్రిష్ణ, శంకర్, శేషు, వెంకటేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా నాగరాజు


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

హిందూపురం అర్బన్, జూలై 4: రోటరీక్లబ్ నూతన అధ్యక్షుడిగా నాగరాజారెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలోగురువారం నూతన కార్యవర్గ సభ్యులను ఇన్‌స్టాలేషన్ అధికారి సాధు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఇన్నర్‌వీల్ అధ్యక్ష కార్యదర్శులుగా విద్య, అశ్వత్థ లక్ష్మి నియమితులయ్యారు. ఇన్‌స్టాలేషన్ అధికారి వారిని సత్కరించారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీగా విజయ్‌కుమార్, కోశాధికారిగా ఫణిరాజు, వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సభ్యులు కల్యాణ్‌కుమార్, శ్రీలక్ష్మి, భువనేశ్వరి, తిమ్మారెడ్డి, సుమంత్, వరదరాజులు గోవర్ధన్‌రెడ్డి, మణికంఠ బద్రీనాథ్, నవీన్, రామచంద్రారెడ్డి రమణ తదితరులు ఉన్నారు.

దాడిలో వ్యక్తి మృతి

హిందూపురం, జూలై 4: మండలంలోని గోళాపురానికి చెందిన సతీష్(45)అనే వ్యక్తిపై నలుగురు వ్యక్తులు కలిసి దాడిచేసి చంపేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. సతీష్‌ను మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఆది, రవి, మూర్తి బయటకు తీసుకెళ్లారు. గ్రామ సమీపంలోనే మాట్లాడదామని తీసుకెళ్లిన వ్యక్తులు నలుగురూ కలిసి కిరాతకంగా దాడిచేశారు. మొహంపై పిడిగుద్దులు గుద్దారు. కర్రలు, రాళ్లతో కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు అయితే సమీపవాసులు గమనించి బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కేసు నమోదుచేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాడిచేసిన వ్యక్తులు గంజాయి మత్తులో ఉన్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


సీజనల్ వ్యాధులపై రాజీవ్‌కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోరంట్ల, జూలై 4: పట్టణంలోని రాజీవ్ కాలనీలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డయేరియా, అతిసార లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ఎంఎల్ హెచ్‌పీ, చైత్ర, ఏఎన్‌ఎం శాంతి, పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.